క్లుప్తంగా

సమ సమాజ స్వాప్నికుడు శివయ్య



తెనాలి: పట్టణానికి చెందిన నేత్ర దాత, త్యాగ శీలి రావూరి శివయ్య ప్రథమ వర్ధంతిని ఆది వారం రాత్రి నాస్తిక సమాజం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో ఏర్పాటైన సభలో సమకాలీన పరిస్థితుల్లో ప్రజల్లో చర్చనీయాం శాలుగా ఉన్న మహిళా బిల్లు, సనాధన ధర్మం-సంస్కృతి అనే అంశాలపై వక్తలు రావూరి శివయ్య స్మారకోపన్యాసాలు చేశారు. రావూరి శివయ్యను సమసమాజ స్వాప్నికుడుగా పేర్కొన్నారు. కనపర్తి బెన్‌హర్‌బాబు సభకు అధ్యక్షత వహించారు. ప్రజాశక్తి బుక్ హౌస్ పూర్వ సంపాదకులు కె.ఉషారాణి, విద్యాపరిరక్షణ కమిటీ నాయకుడు రమేష్ పట్నాయక్ మాట్లాడారు. ప్రజా నాట్య మండలి పిచ్చయ్య, మల్లెల త్రివేది అభ్యుదయ గీతాలు ఆలపించారు. రావూరి శివయ్యకు పుష్పాంజలి ఘటించారు. దరిశి చెంచయ్యపై గౌరవ్ సంపాదకత్వంలో వచ్చిన 'ఆయన జీవితమే ఒక సందేశం' పుస్తకాన్ని, రమేష్ పట్నాయక్ రచన 'చారిత్రక భౌతికవాదం' పుస్తకాలను ఆవిష్కరించారు. ఆయా పుస్తకాలపై ప్రముఖ న్యాయవాది జీఎస్ నాగేశ్వరరావు, సీహెచ్ కోటేశ్వరరావు మాట్లాడారు. సీపీఎం నాయకులు బాబూప్రసాద్, అందె శ్యాం, డీఎస్ఎన్, వై.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయాలి

తెనాలి: ప్రధాని నరేంద్ర మోదీ అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా నవంబరు 26, 27, 28 తేదీల్లో దేశ వ్యాప్తంగా గవర్నర్ కార్యాలయాల ఎదుట ధర్నా చేయాలని అఖిల భారత రైతు సంఘాల సమన్వయ కమిటీ పిలుపునిచ్చిందని రైతు కూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొల్లిముంత సాంబ శివరావు సోమవారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ గవర్నర్ కార్యాలయం ఎదుట 20 సంఘాల ఆధ్వర్యంలో జరగనున్న ధర్నాను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ధర్నా సన్నాహకాల్లో భాగంగా రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం విజయవాడ న్యూగిరి పురంలో సంఘం అధ్యక్షురాలు ఎస్.ఝాన్సీ అధ్యక్షతన జరిగిందని తెలిపారు. జన సమీకరణ కోసం కార్యకర్తలు గ్రామాల్లో ప్రచారం చేసి, మోదీ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను వివరించాలని కోరినట్లు తెలిపారు. నవంబరు, డిసెంబరు నెలల్లో అమరుల వర్ధంతి సభలు జరపాలని, ప్రజలు ఎదుర్కొంటున్న తక్షణ సమస్యలపై ప్రజల్లో ప్రచారం చేసి ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలని కూడా సమావేశం నిర్ణయించినట్లు వివరించారు.

లాలాపేట ఎస్‌హెచ్‌ఓగా శ్రీనివాసరావు



పట్నంబజారు: గుంటూరు ఈస్ట్ డివిజన్ పరిధిలోని లాలాపేట పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా ఎం.శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు. 2009 బ్యాచ్‌కు చెందిన శ్రీనివాసరావు ఎస్సైగా బాధ్యతలు చేపట్టారు. 2020 సంవత్సరంలో సీఐగా పదోన్నతి లభించిన శ్రీనివాసరావు ఒంగోలుతోపాటు పలు ప్రాంతాల్లో పనిచేశారు. అనంతరం ఈస్ట్ ట్రాఫిక్ సీఐగా గత మూడు నెలల క్రితం నియమితులయ్యారు. ఈనేపథ్యంలో లాలాపేట పీఎస్ ఎస్‌హెచ్‌ఓగా బాధ్యతలు అప్పజెబుతూ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు.

ట్రాఫిక్ సీఐగా కోటేశ్వరరావు



పట్నంబజారు: గుంటూరు ఈస్ట్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ సీఐగా బి.కోటేశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. 2002 బ్యాచ్ ఎస్సైగా పోలీసు విధుల్లోకి వచ్చిన ఆయన గుంటూరుతోపాటు పలు ప్రాంతాల్లో పనిచేశారు. అనంతరం 2012లో ఆయనకు సీఐగా పదోన్నతి లభించింది. సీఐగా గురజాల, సత్తెనపల్లి, నరసరావుపేట, గుంటూరు నగరంపాలెం, తెనాలి-2 టౌన్ పోలీసు స్టేషన్ సీఐగా బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం వీఆర్‌లో ఉన్న కోటేశ్వరరావును ట్రాఫిక్ సీఐగా నియమిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు.

770 గ్రాముల శిశువును బతికించారు..

గుంటూరు మెడికల్: ఆరున్నర నెలలకే ప్రసవమై 770 గ్రాముల బరువు ఉన్న ఆడ శిశువును అత్యాధునిక వైద్య పరికరాలతో మెరుగైన చికిత్స అందించి ప్రాణాలు కాపాడినట్లు నియోనాటాలజిస్ట్ డాక్టర్ దేవభక్తుని రాకేష్‌బాబు చెప్పారు. సోమవారం స్థానిక బృందావన్‌గార్డెన్స్ 7వ లైనులోని ఆయుష్మాన్ తల్లీపిల్లల హాస్పిటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. జిల్లాలోని తెనాలికి చెందిన మమత గర్భం దాల్చిన ఆరున్నరనెలలకే ప్రసవం జరిగి ఆగస్టు 5న శిశువుతో తమ ఆస్పత్రికి వచ్చిందని చెప్పారు. అత్యాధునిక వైద్య పరికరాలతో 70 రోజుల పాటు చికిత్స అందించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం పసికందు బరువు 1500 గ్రాములకు చేరిందన్నారు. శిశువు ఆరోగ్యంగా ఉండటంతో సోమవారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేసినట్లు డాక్టర్ ప్రియాంక వెల్లడించారు.

మున్సిపల్ చైర్‌పర్సన్ రాజీనామా ఆమోదం

ఇన్‌చార్జిగా వైస్ చైర్మన్ మాలేపాటి హరి ప్రసాద్



సమావేశానికి హాజరైన కౌన్సిలర్‌లు, కో-ఆప్షన్ సభ్యులు



అధ్యక్షత వహించిన వైస్ చైర్మన్ హరిప్రసాద్

తెనాలిఅర్బన్: తెనాలి మునిసిపల్ చైర్ పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీమ్ రాజీనామాను కౌన్సిల్ ఆమోదించింది. పురపాలక సంఘంలో సోమవారం కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశం ప్రారంభం కాగానే చైర్ పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీమ్ గైర్హాజరైనందున వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్ సమావేశాన్ని నడిపించవలసిందిగా మేనేజర్ అప్పలరాజు కోరారు. దీంతో హరిప్రసాద్ అధ్యక్ష స్థానంలో కూర్చుని, సభను నడిపించారు. అజండాలోని 12వ అంశం చదవటం పూర్తికాగానే వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ షేక్ దుబాయ్ బాబు లేచి చైర్ పర్సన్ రాజీనామాను అమోదిస్తున్నామని చెప్పారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ముస్లిం మైనార్టీలకు చైర్ పర్సన్ పదవిని ఇచ్చారని గుర్తుచేశారు. చైర్ పర్సన్‌గా ఖాలేదా నసీమ్ తెనాలి పట్టణ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. గతంలో ఏ రాజకీయ పార్టీ ముస్లిం మైనార్టీలకు ఇలాంటి హోదాను ఇవ్వలేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి సారథ్యంలోని ప్రభుత్వం ముస్లిం మైనార్టీలకు అత్యున్నత పదవులు ఇచ్చిందని గుర్తుచేశారు. సీఎం జగన్‌కు, ఎమ్మెల్యే శివకుమార్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మిగిలిన మూడు అంశాలు చదివి అజెండాను ఆమోదించారు. అనంతరం జీరో అవర్ నిర్వహించారు. పలువురు కౌన్సిలర్లు తమ వార్డులలో నెలకొన్న సమస్యలను విన్నవించారు. వాటిని పరిష్కరించాలని వైస్ చైర్మన్ ఆదేశించారు. అనంతరం అజెండాలోని అన్ని అంశాలు ఆమోదించినట్లు ఆయన ప్రకటించి సమావేశాన్ని ముగించారు. సయ్యద్ ఖాలేదా నసీమ్ రాజీనామాను కౌన్సిల్ ఆమోదించిన నేపథ్యంలో తదుపరి చైర్‌పర్సన్ ఎన్నిక జరిగే వరకు ఇన్‌చార్జి చైర్మన్‌గా మాలేపాటి హరిప్రసాద్ వ్యవహరిస్తారని కమిషనర్ ఎం.జశ్వంతరావు ప్రకటించారు. మాలేపాటి హరిప్రసాద్ మాట్లాడుతూ తనకు ఈ అవకాశాన్ని కల్పించిన ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే, కౌన్సిలర్‌లు, కో-ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారుల సహకారంతో తెనాలి పట్టణ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. ఆయనకు మున్సిపల్ అధికారుల, వైఎస్సార్ సీపీ నాయకులు, కౌన్సిలర్‌లు, పలువురు ఆర్యవైశ్య నాయకులు పుష్పగుచ్ఛాలు అందజేసి, అభినందించారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ అత్తోట నాగవేణి, ఎంఈ నాగ మల్లేశ్వరరావు, కౌన్సిలర్‌లు, కో-అప్షన్ సభ్యులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



ఆశ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శివకుమార్



చినరావూరు తోటలో వైద్య పరీక్షలు

తెనాలిటౌన్: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి ముఖ్యమంత్రి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టారని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. నంది వెలుగులోని మండల పరిషత్ రెగ్యులర్ పాఠశాలలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే శివకుమార్ సందర్శించారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కొలకలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుబ్బారావు పర్యవేక్షణలో వైద్యులు బీబీజాన్, అఖిల్, మన్మథకుమార్, దిలీప్ రోగులకు వైద్య పరీక్షలు చేశారు. రోగులకు బీపీ, షుగర్, ఈసీజీ, రక్త పరీక్షలు జరిపారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎల్.విజయాలక్ష్మణ్, ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, సర్పంచ్ దూళిపాళ్ల పవన్‌కుమార్, ఎంపీటీసీలు సిలార్‌జానీ, తిన్నలూరి విజయలక్ష్మి, సొసైటీ చైర్మన్ తోటకూర వసంతరావు, అగస్త్యేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ తన్నీరు వెంకటేశ్వరరావు, ఉప సర్పంచ్ మంగా శివనాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

తెనాలిఅర్బన్: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని 14వ వార్డు కౌన్సిలర్ దాసరి వీర వసంతరావు అన్నారు. చినరావూరు తోటలోని మదర్ థెరిస్సా మున్సిపల్ స్కూల్‌లో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. మున్సిపల్ ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల మాట్లాడుతూ సురక్ష క్యాంప్‌లో జనరల్ పరీక్షలు 128, గైనకాలజీ 39, ఫిజీషియన్ 84, ఆప్తమాలజీ 66 మందికి వైద్య సేవలు అందించినట్లు చెప్పారు. అవసరమైన వారికి బీపీ, షుగర్, ఇతర రక్త, మూత్ర పరీక్షలను ఉచితంగా చేశారు. మందులు ఉచితంగా పంపిణీ చేశారు. వైద్యులు డాక్టర్ డి.కృష్ణ కిషోర్, డాక్టర్ వి.మౌనిక కుమార్, డాక్టర్ వి.దేవిక వాణి, డాక్టర్ సంహిత, డాక్టర్ మనీషా, డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ జంగం శ్యామ్, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, సూపర్ వైజర్ దీపాల శ్రీనివాసరావు, సచివాలయ అడ్మిన్ ఎం.సుధాకర్‌రెడ్డి, పలువురు ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు చినరావూరు తోటలో వైద్య శిబిరం

తెనాలి అర్బన్: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని మంగళవారం చినరావూరు తోటలోని మథర్ థెరిస్సా స్కూల్‌లో నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 17వ వార్డు సచివాలయం పరిధిలోని ప్రజలకు ఇక్కడ వైద్య సేవలు అందించటం జరుగుతుందన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వైద్య సేవలందించనున్నట్లు పేర్కొన్నారు.

సురక్ష వైద్య శిబిరాలు.. పేదలకు రక్షణ కవచాలు

పిడపర్రు(కొల్లిపర): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు పేదల ఆరోగ్యానికి రక్షణ కవచంలా ఉన్నాయని, ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. మండలంలోని పిడపర్రు గ్రామ సచివాలయం లో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇంత వరకు ఎంతో మంది పాలకులను మనం చూసి ఉండవచ్చని, అయితే ప్రజా సంక్షేమం, ఆరోగ్యం గురించి ఆలోచించన కుటుంబం మాత్రం కేవలం వైఎస్ఆర్ కుటుంబం మాత్రమే అన్నారు. మంచి చేసే ప్రభుత్వాన్ని మళ్లీ నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వైద్య శిబిరంలో డాక్టర్ చిక్కాల లక్ష్మిసుధ, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ దిలీప్, స్పెషలిస్ట్ డాక్టర్ సాయికిరణ్, డాక్టర్ షేక్ కరిముల్లా 339 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 88 మందికి రక్త పరీక్షలు, 90 మందికి ఈసీజీ పరీక్షలు, మిగిలిన వారికి కంటి, బీపీ షుగర్ వంటి పరీక్షలు చేసి మందులు అందజేశారు. 44 మందిని మెరుగైన చికిత్స కోసం జిల్లా ఆసుపత్రికి, కార్పొరేట్ హాస్పిటల్‌కి రిఫర్ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భీమవరపు పద్మావతి, సర్పంచ్ దూరి రత్నాబాబు, పిడపర్తిపాలెం సర్పంచ్ బొళ్ల కరుణ శ్రీ, పార్టీ మండల అధ్యక్షుడు అవుతు కోటిరెడ్డి, ఎంపీడీవో విజయలక్ష్మి, తహసీల్దారు నాంచారయ్య, తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలి

- జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్
- సందడిగా వైద్య కళాశాల ఫ్రెషర్స్ డే



మాట్లాడుతున్న డాక్టర్ కిరణ్ కుమార్

గుంటూరు మెడికల్: వైద్య విద్యార్థులు తల్లిదండ్రుల కలలు సాకారం చేయాలని, వైద్య వృత్తి మానవ సంబంధాలకు దగ్గరగా ఉంటుందని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ అన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలలో సోమవారం జరిగిన ఫ్రెషర్స్ డే వేడుకలు జరిగాయి. వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ప్రజల ప్రాణాలను కాపాడే వైద్య వృత్తిని విద్యార్థులు ఎంపిక చేసుకోవడం అదృష్టమన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తల్లిదండ్రులకు అధ్యాపకులతో పంచుకుని వత్తిడిని అధిగమించాలని, వైద్యానికి ఎంతో డిమాండ్ ఉందని, ప్రజలు వైద్యుడిని దేవుడితో సమానంగా కొలుస్తారన్నారు. మానవత్వంతో రోగులకు వైద్యం అందించాలన్నారు. వైద్య వృత్తిని ఎంచుకున్న పరిశోధనలపై దృష్టి సారించాలన్నారు. అందుకు అవసరమైన వసతులు వైద్య కళాశాలలో ఉన్నాయన్నారు.

యాప్రాన్ ధరించండి

వైద్య వత్తిలో ఉన్నప్పుడు బాధ్యతగా యాప్రాన్ ధరించాలని డాక్టర్ కిరణ్‌కుమార్ చెప్పారు. యాప్రాన్ ధరించడం వల్ల వృత్తిపై గౌరవం పెరుగుతుందన్నారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.టి.కె.రెడ్డి మాట్లాడుతూ గుంటూరు మెడికల్ కళాశాలకు ఎంతో ఘన చరిత్ర ఉందన్నారు. వైద్య కళాశాలలో చదివిన వైద్య విద్యార్థులు దేశ విదేశాల్లో స్థిరపడి కళాశాల అభివృద్ధి కోసం కృషి చేసి మానవతా మూర్తులుగా నిలిచి పోయారని చెప్పారు. కళాశాలల్లో చదువుతున్నందుకు అందరూ గర్వపడాలన్నారు. ప్రస్తుత వైద్య విద్యార్థులు చదువుకున్న సంస్థకు మంచి పేరు తీసుకు రావాలన్నారు. ర్యాగింగ్ మహాపెను భూతం లాంటిదని, ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలన్నారు. ఒకప్పుడు వైద్య కళాశాలలో 50 మెడికల్ సీట్లు ఉంటే నేడు 250 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయన్నారు. వైద్య వృత్తిలోకి ప్రవేశిస్తున్న వైద్య విద్యార్థులతో ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్ ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో ఆహూతులను అలరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ప్రభాకర రావు, డాక్టర్ శ్రీధర్, డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస ప్రసాద్, జింకాన కో ఆర్డినేటర్స్ డాక్టర్ బాల భాస్కర రావు, డాక్టర్ హనుమంత రావు పాల్గొన్నారు.

జీజీహెచ్ ఫిజియోథెరపీ విరాళం

గుంటూరు జీజీహెచ్ అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ అన్నారు. సోమవారం ఫిజియోథెరపీ విభాగానికి సిమ్స్ కళాశాల ప్రిన్సిపల్, కార్యదర్శి డాక్టర్ శివశిరీష అందజేసిన రూ. 2 లక్షలు ఖరీదు చేసే వైద్య పరికరాలను డాక్టర్ కిరణ్‌కుమార్ ప్రారంభించారు. డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఫిజియోథెరపీ విభాగానికి వచ్చే రోగులను ఆప్యాయంగా పలకరించి మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. సిమ్స్ కళాశాల ఇచ్చిన పరికరాలు రోగులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. మరింత మంది దాతలు ముందుకు వచ్చి ఆసుపత్రి అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రమణ యశస్వి, డాక్టర్ సతీష్ కుమార్, ఈశ్వర్ రెడ్డి, సుశీల పాల్గొన్నారు.

'స్పందన'లో ఆరు అర్జీలు



తెనాలి: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన సమావేశానికి ఆరు అర్జీలు వచ్చాయి. డివిజనల్ పరిపాలన అధికారి వెంకటస్వామి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. రెవెన్యూ విభాగానికి సంబంధించి ఒకటి, ఎడ్యుకేషన్ అంశంపై రెండు, మెప్మా విభాగానికి ఒకటి, మున్సిపాలిటీ, పౌర సరఫరాల శాఖలకు చెరొకటి చొప్పున అర్జీలు వచ్చాయి. సంబంధిత శాఖలకు పంపి, నిర్ణీత వ్యవధిలో పరిష్కారమయ్యేలా చూస్తామని ఏవో తెలిపారు.

అనుమానాస్పద మృతి కేసు నమోదు

తెనాలిరూరల్: అనుమానాస్పద మృతి కింద కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. పట్టణ చినరావూరుకు చెందిన వ్యాపారి పుట్టి పుల్లారావు ఇటీవల మృతి చెందారు. దహన సంస్కారాలూ పూర్తయ్యాయి. ఆయన మృతిపై అనుమానాలున్నాయంటూ బంధువులు సోమవారం స్పందనలో ఫిర్యాదు చేశారు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ కె. చంద్రశేఖర్ తెలిపారు. అనారోగ్య సమస్యలతో మృతి చెంది ఉంటారని ప్రాథమికంగా భావిస్తున్నట్టు చెప్పారు. దర్యాప్తులో అన్ని విషయాలు వెలుగులోకి వస్తాయన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు



ఉద్యోగుల సమస్యలను తెలుసుకుంటున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: ఉద్యోగుల సమస్యలపై అందే ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి డిప్యూటీ కమిషనర్లను, విభాగాధిపతులను ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో ఎంప్లాయిస్ గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థకు చెందిన వివిధ విభాగాల ఉద్యోగులకు సంబంధించిన సర్వీస్ సమస్యల పరిష్కారం కోసం ప్రతి నెల 3వ సోమవారం మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామన్నారు. గ్రీవెన్స్‌లో ఆయా విభాగాధిపతులు, డిప్యూటీ కమిషనర్లు పాల్గొంటారని, నగరపాలక సంస్థ పరిధిలోని వార్డు సచివాలయ కార్యదర్శులు, మినిస్టీరియల్ సిబ్బంది, ఆయా విభాగ ఉద్యోగులు తమవిధి నిర్వహణలో ఎదురవుతున్న, సర్వీస్‌కి సంబంధించిన సమస్యలపై అర్జీలు అందించవచ్చన్నారు. ఉద్యోగులు తమ సమస్యలపై అందించే అర్జీలను ప్రత్యేకంగా రిజిస్టర్‌లో నమోదు చేయాలని, వచ్చే నెలలో జరిగే గ్రీవెన్స్ నాటికి ప్రస్తుతం అందిన అర్జీల పరిష్కార వివరాల రిపోర్ట్‌తో హాజరు కావాలని మేనేజర్‌ని ఆదేశించారు. విధి నిర్వహణలో క్రమశిక్షణ చర్యలు తీసుకున్న సిబ్బందిపై అధికారుల విచారణ నివేదికలతో డిప్యూటీ కమిషనర్ వచ్చే చర్చించాలని ఆదేశించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఉద్యోగుల సమస్యలపై స్పెషల్ గ్రీవెన్స్ నిర్వహిస్తున్న కమిషనర్‌ని ఎన్‌జీఓ అసోసియేషన్ నాయకులు శ్రీనివాస్, సతీష్ కుమార్‌లు కలిసి ఉద్యోగుల పక్షాన హర్షం వ్యక్తం చేశారు.

కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, ఎంహెచ్‌ఓ డాక్టర్ భాను ప్రకాష్, మేనేజర్ శివన్నారాయణ, వివిధ విభాగాల సూపరిండెంటెంట్లు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారమే అభిమతం

- తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్
- టిడ్కో గృహ సముదాయం సందర్శన
- సమస్యల పరిష్కారానికి అక్కడికక్కడే చర్యలు



టిడ్కో సముదాయంలో స్థానికులతో ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకుని, సత్వర పరిష్కారానికి కృషి చేయటం తమ అభిమతమని తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. జగ్గడిగుంటపాలెంలోని టిడ్కో గృహ సముదాయం నివాసితుల కోరిక మేరకు ఆ ప్రాంతాన్ని ఆయన సందర్శించారు. టిడ్కో సముదాయానికి మంచి నీటి సరఫరా, డ్రెయినేజీ సౌకర్యం, రహదారులు, వీధి దీపాలు సహా అన్ని రకాల వసతులను స్వయంగా ఎమ్మెల్యే అన్నాబత్తుని పరిశీలించారు. తాగునీటి పంపులను శుభ్రం చేసి, నీరు ధారాళంగా వచ్చేలా అక్కడికక్కడే ఆదేశాలు జారీ చేశారు. సాయంత్రానికి ఆ కార్యక్రమం పూర్తయింది. వీధిలైట్ల సమస్యకు, బ్లాక్‌ల మధ్య ఖాళీ స్థలంలో పిచ్చిమొక్కల తొలగింపునకు మునిసిపల్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడ స్థిరపడిన తాము రేషన్, పింఛన్ల కోసం తమ ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని స్థానిక మహిళలు ఎమ్మెల్యే ఎదుట ఏకరువు పెట్టారు. సమస్యను అర్థం చేసుకున్న ఆయన ప్రతి నెలా టిడ్కో గృహాల వద్దనే రేషను బియ్యం ఇప్పించేలా ఏర్పాట్లు చేస్తానని హామీ ఇచ్చారు. వలంటీరును అందుబాటులో ఉంచి పింఛను ఇంటి దగ్గరే ఇప్పిస్తామని స్పష్టంగా చెప్పారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఇదే వారంలో టిడ్కో గృహాల వద్ద ఏర్పాటు చేసి వైద్య సేవలు అందిస్తానని పేర్కొన్నారు. వీటితో పాటు కాలనీ ప్రారంభోత్సవంలో ఇచ్చిన హామీ మేరకు ప్రధాన రోడ్డుపైకి వచ్చేందుకు పంట కాల్వపై వంతెన నిర్మాణం త్వరలోనే కార్యరూపం దాల్చనుందని తెలిపారు. సమస్యల పరిష్కారంపై ఎమ్మెల్యే చూపిన చొరవకు నివాసితులు కృతజ్ఞతలు తెలియజేశారు.

భక్తి శ్రద్ధలతో శరన్నవరాత్రి ఉత్సవాలు



అన్నపూర్ణదేవిగా వాసవీ మాత



అన్నపూర్ణదేవిగా రాజరాజేశ్వరిదేవి



ఆలయంలో ఎమ్మెల్యేకు తీర్థం అందజేస్తున్న అర్చకుడు వాసుబాబు



శ్రీ విద్యాపీఠంలో పూజలు నిర్వహిస్తున్న బాల స్వామిజీ



వాసవీ ఆలయంలో చండీ హోమం

తెనాలిటౌన్: దసరా ఉత్సవాలు పట్టణ, మండల గ్రామాల్లో వైభవంగా జరుగుతున్నాయి. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. నంది వెలుగులోని శ్రీ అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పూజలు జరిపారు. అర్చకులు, వైఎస్సార్ సీపీ నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అర్చకులకు తీర్థ ప్రసాదాలు అందజేసి, సత్కరించారు. సర్పంచ్ ధూళిపాళ్ళ పవన్ కుమార్, దేవస్థాన చైర్మన్ తన్నీరు వెంకటేశ్వరరావు, ఈఓ తమ్మా శివారెడ్డి ఆయన వెంట ఉన్నారు.

- బోసు రోడ్డులోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో కొల్లా గురునాథ గుప్తా దంపతులు, కుటుంబ సభ్యులు శ్రీ చండీ హోమం నిర్వహించారు. ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మారీసుపేటలోని చంద్రమౌళేశ్వరస్వామి ఆలయంలో బాలత్రిపుర సుందరీదేవికి గాయత్రీదేవి అలంకరణ చేశారు. దేవి చౌక్‌లోని రాజరాజేశ్వరి దేవస్థానంలో అమ్మవారిని అన్నపూర్ణదేవిగా అలంకరించారు. గంగానమ్మపేటలోని శ్రీ విద్యాపీఠంలో సాలిగ్రామ మఠం ఆధ్వర్యంలో పూజ్యశ్రీ బాల స్వామిజీ పర్యవేక్షణలో ఉత్సవాలు జరుగుతున్నాయి. అమ్మవారిని అన్నపూర్ణదేవిగా ముత్యాలతో అలంకరణ చేశారు. భక్తులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. వరదరాజులు దంపతులు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎం.రమణయ్య, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇజ్రాయెల్‌లో శాంతి నెలకొనాలి

- సామాజిక సేవలో నిమగ్నమవుతా
- ఇజ్రాయెల్ యువతి అరవ



తెనాలి: 'ఇజ్రాయెల్‌లో ఆకస్మికంగా ఆరంభమైన యుద్ధం భయాందోళన కలిగిస్తోంది...త్వరగా ముగిసి శాంతి నెలకొనాలని ఆకాంక్షిస్తున్నా..వెనువెంటనే వెళ్లి అక్కడ సామాజిక సేవలో నిమగ్నం కావాలని కోరుకుంటున్నాం..' ఇజ్రాయెల్ యువతి అరవ అన్నారు. చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెంలోని యూదులు (బెనె ఎఫ్రాయిమ్ కమ్యూనిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్)ను కలిసేందుకు ఆమె వచ్చారు. యూదుల అతి ముఖ్యమైన పండుగల్లో ఒకటైన పర్ణశాలల పండుగను ఇక్కడి వారితో కలిసి జరుపుకున్నారు. చివరిరోజు 'సింహత్వర' (ధర్మశాస్త్రం నందు ఆనందించటం) వేడుకకు అంతా ఏర్పాట్లు చేస్తుండగా గాజా స్ట్రిప్ నుంచి హమాస్ మిలిటెంట్లు రాకెట్ దాడులు చేయటం, సరిహద్దుల్నుంచి అక్రమంగా లోనికి ప్రవేశించటంతో ఇజ్రాయెల్ దేశం స్టేట్ ఆఫ్ వార్‌ను ప్రకటించటం వెనువెంటనే జరిగాయి.

కొత్తరెడ్డిపాలెంలోని యూదుల ప్రార్థన మందిరం 'బెనె యాకోబ్ సునగోగు'లో ఉన్న అరవకు ఈ పరిణామాలు కలవరం కలిగించాయి. స్వదేశంలో ఉన్న తల్లిదండ్రులు ఎలాగున్నారో? అనే భయాందోళనలు ముప్పిరిగొన్నాయి. హమాస్ రాకెట్ దాడుల వెంటనే ఇజ్రాయెల్ ప్రభుత్వం హెచ్చరించినట్లు ఇజ్రాయెల్ పౌరులు చాలా మంది రక్షణ కోసం సిద్ధం చేసుకున్న బంకర్లలోకి వెళ్లి పోయారు. ఫలితంగా కొన్ని గంటల తర్వాతనే అరవ, తల్లిదండ్రులతో ఫోనులో మాట్లాడగలిగారు. వారు క్షేమంగా ఉన్నారని తెలిశాకనే మనసు కుదుటపడినట్టు ఆదివారం 'సాక్షి'తో చెప్పారు.

ఇజ్రాయెల్‌కు చెందిన అరవ హైస్కూలు తర్వాత ఒకటిన్నర సంవత్సరం కాలేజి చదువు పూర్తిచేశారు. అక్కడి ప్రభుత్వ పాలసీ ప్రకారం ప్రతి ఒక్కరూ సైన్యంలో పనిచేయాల్సి ఉంటుందని చెప్పారు. ఆ క్రమంలోనే రెండేళ్లపాటు సైన్యంలో పనిచేశారు. 'సైనికులు ఎవరైనా గాయపడితే వారికి వైద్య చికిత్స చేయించటం వారిని కనిపెట్టుకుని ఉండటం వంటి బాధ్యతలను నిర్వర్తించాను' అని చెప్పారు. ఆర్మీలో పనిచేసిన యువతీ యువకులు కోరుకున్న దేశాన్ని సందర్శించి రావటానికి ఇజ్రాయెల్ దేశం అనుమతిస్తుంది. ఆ క్రమంలో భారతదేశం సందర్శనను కోరుకుందా యువతి.

మూడు నెలల కిందట మన దేశంలోకి అడుగుపెట్టారు. అందమైన కశ్మీర్, లడాఖ్, ధర్మశాల, నేపాల్‌ను దర్శించుకుని, కొద్దిరోజుల క్రితమే కొత్తరెడ్డిపాలెం చేరుకున్నారు. 'భారతదేశం గురించి నేను ఎంతో విన్నాను...ఇక్కడి ప్రజలు మంచివారు. ప్రేమాభిమానాలతో ఉంటారనే భావనతో ఈ దేశాన్ని సందర్శించాలని నేను ఎంచుకున్నాను' అన్నారు అరవ. కొత్తరెడ్డిపాలెం రావటానికి గల కారణాన్ని ప్రశ్నిస్తే, 'రెండేళ్ల క్రితమే ఇక్కడి యూదుల గురించి తెలిసింది...ఎక్కడో దేశంకాని దేశంలో జీవిస్తూ తరాలుగా తమ భాషను, ఆచార వ్యవహారాలను కొనసాగిస్తుండటం అబ్బురం కలిగించింది... భారతదేశం అంటూ వస్తే వీరిని చూడాలని అప్పుడే నిశ్చయించుకున్నాను' అని చెప్పారు. కొద్దిరోజులైనా వీరితో గడపటం, పండగ సంబరాలను జరుపుకోవటం మధురానుభూతి. సింహత్వర పండుగ రోజున విచారంతో గడిపాం... కేవలం ప్రార్థనలు మాత్రమే చేసుకోగలిగామని గుర్తుచేశారు. ఇప్పుడిక ఎంత త్వరగా ఇజ్రాయెల్ చేరుకోవాలన్న ఆతురతతో ఉన్నానని చెప్పారు. దేశంలోకి వెళ్లిన వెంటనే సోషల్ వర్క్‌లో నిమగ్నం కావాలని భావిస్తున్నట్టు చెప్పారు. వీరితో బెనె యాకోబ్ సినగోగు సమాజ మందిరం నిర్వాహకుడు సాదోక్ యాకోబి ఉన్నారు.